# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతోనే దేశ ఆర్థిక ప్రగతి సాధ్యపడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ ప్రతిష్టాత్మకమైన 2029 ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్ ఎంపిక అయ్యింది.
- ❖ "ఆపరేషన్ సిందూర్"లో కీలక పాత్ర పోషించిన సుఖోయ్ జెట్‌ల సామర్ధ్యాన్ని మరింతగా ఉన్నతీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- ❖ ఉగ్రవాదం విషయంలో భారతదేశం రాజీ పడబోదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- ❖ దేశవ్యాప్తంగా ఈ రోజు జగన్నాధ స్వామి రధయాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు MSME దేశ ఆర్థిక ప్రగతిలో అత్యంత ముఖ్య భూమికను పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూ ఢిల్లీలో ఈ రోజు జరిగిన అంతర్జాతీయ MSME దినోత్సవంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... MSMEలు దేశీయ ఉత్పత్తిలో సుమారు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే తయారీ విభాగంలో 36 శాతం పైగా MSMEల భాగస్వామ్యం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలోనూ MSMEల పాత్ర కీలకంగా ఉందని రాష్ట్రపతి పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిష్టాత్మకమైన 2029 ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికైనట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఈ క్రీడలు నిర్వహించనున్నామని చెప్పారు. ఈ అవకాశం దక్కడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. పోలీసు క్రీడల నిర్వహణ కోసం భారత్ ఈ ప్రతిష్టాత్మక బిడ్‌ను గెలుచుకొంది. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన విశాలమైన క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. 1985 నుంచి రెండేళ్లకు ఒకసారి ప్రపంచ పోలీసు, అగ్నిమాపక కీడ్రలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 20 సార్లు ఈ పోటీలు జరిగాయి. అమెరికా 8, కెనడా 5, యూరప్ 4, బ్రిటన్ 2, చైనా ఒకసారి ఈ క్రీడలు నిర్వహించాయి. 2007 నుంచి 2023 వరకు భారత పోలీసు సిబ్బంది 1400 పతకాలు గెలుచుకున్నారు అని అమిత్ షా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్థాన్ తో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రస్థావరాల లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన సుఖోయ్ జెట్‌ల సామర్థ్యాన్ని మరింతగా ఉన్నతీకరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రష్యా రక్షణ మంత్రి ఆండ్రీ బెలోసోవ్‌తో జరిగిన చర్చల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆ విషయాన్ని ప్రతిపాదించారు. సుఖోయ్-30MKI యుద్ధ విమానాల ఉన్నతీకరణ, ఎయిర్-టు-ఎయిర్ క్షిపణుల ఉత్పత్తి, S-400 క్షిపణి వ్యవస్థలపై కూడా ఇద్దరు రక్షణ మంత్రులు చర్చించారు. షాంఘై సహకార సంస్థ (SCO) సమావేశం సందర్భంగా ఇరు దేశాల రక్షణ మంత్రులు ఈ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. చైనా నగరమైన కింగ్‌డావోలో ఆ సమావేశం జరిగింది. కాగా, భారత వైమానిక దళం దాదాపు 260 వరకూ సుఖోయ్ 30-MKI జెట్‌లను నడుపుతోంది. గత నెలలో జరిగిన “ఆపరేషన్ సిందూర్”లో రష్యాకు చెందిన సుఖోయ్ జెట్‌లు కీలకంగా వినియోగించిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్, ఆండ్రీ బెలోసోవ్ ప్రపంచంలోని ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు, సరిహద్దు ఉగ్రవాదం, ఇండో-రష్యన్ రక్షణ సహకారం వంటి అనేక అంశాలపై లోతైన చర్చలు జరిపారని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిషాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పూరీలో జగన్నాథ రథయాత్ర ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ విదియ నాడు జరిగే రథయాత్రను స్వయంగా తిలకించేందుకు దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో పూరీ పుణ్య క్షేత్రం మొత్తం భక్తులతో కోలాహలంగా మారింది. రథయాత్రలో తొలిసారిగా 275 కృత్రిమ మేథ (ఏఐ)తో పని చేసే కెమెరాలు, డ్రోన్ల ద్వారా రద్దీ నియంత్రణకు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లో జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. జమాల్పూర్ ప్రాంతంలో 400 సంవత్సరాల పాత జగన్నాథ ఆలయం నుండి రథయాత్ర కొనసాగింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జగన్నాథ ఆలయంలో స్వామిని దర్శించి పూజలు చేశారు. మరో వైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా దేశంలోని భక్తులందరికీ జగన్నాథ రథ యాత్ర సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీలో ఈ రోజు ప్రభుత్వ రంగ బ్యాంకుల పని తీరుపైన నిర్వహించిన సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పాంకజ్ చౌధురీ, ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎమ్. నాగరాజు, ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరక్టర్లు సీఎఇఓలు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం విషయంలో భారతదేశం రాజీ పడబోదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రక్షణ మంత్రుల సమావేశంలో సంయుక్త పత్రంపై భారతదేశం

సంతకం చేయకపోవడానికి గల కారణాలను ఆయన తెలియచేసారు. ఈ మేరకు న్యూఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ... ఎస్.సీ.ఓ. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఏర్పడిందని గుర్తు చేశారు. అయితే ఉగ్రవాదం గురించి సంయుక్త పత్రంలో ప్రస్తావించకపోవడం వల్లనే భారతదేశం సంతకం చేయలేదని వివరించారు. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంగా చెప్పారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 41 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీ వీధులలో ప్రజా రవాణా కోసం వంద వరకూ విద్యుత్ తో నడించే బస్సులను ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ, ఈ వంద బస్సులు ఢిల్లీలోని తొమ్మిది విభిన్న మార్గాల్లో నడుస్తాయన్నారు. ఢిల్లీలో ప్రజా రవాణా వ్యవస్థను విద్యుత్ తో నడిచే బస్సులతో పూర్తిగా ఆధునీకరించాలని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఢిల్లీ ప్రజలకు కనీస ఇబ్బంది కలిగించకుండా ఉండటానికి ఈ లక్ష్యం ఎంచుకున్నామని ఆమె తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇజ్రాయెల్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశ గగనతలాన్ని పూర్తిస్థాయిలో పునఃప్రారంభించే నిర్ణయాన్ని రేపు మధ్యాహ్నానికి వాయిదా వేసింది. దేశంలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ ప్రాంతాల గగనతలంపై ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ ఈ రోజు ఒక ప్రకటన విడుదల చేసింది. విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని ఇరాన్ రోడ్లు, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధి మజిద్ అఖవాన్ తెలిపారు. ఇప్పటికే దేశ తూర్పు గగనతలాన్ని దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల కోసం తెరిచామని, మిగిలిన గగనతలాన్ని రేపటి వరకు మూసివేస్తున్నామని ఆయన వెల్లడించారు. దశలవారీగా విమాన గగనతలాన్ని ఘర్షణలకు ముందున్న స్థాయికి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =